నమస్తే తెలంగాణ
ఖమ్మం
3 | ఖమ్మం, మంగళవారం 24 సెప్టెంబర్ 2024 | KHAMMAM

లక్షలాది ఎకరాలు ఎండిపోయినంక నీళ్లిస్తరా?

- నీటిపారుదల శాఖ ఉండి ఏమిటీ ప్రయోజనం?
- పనుల ఆలస్యానికి కారణం ఎవరో చెప్పాలని కలెక్టర్‌కు ఆదేశం
- యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసి సాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలి..
- అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఖమ్మం జిల్లా పాలేరులో సాగర్ కాల్వ మరమ్మతు పనుల పరిశీలన
- హైదరాబాద్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రెస్‌మీట్ ఎఫెక్ట్

ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు కాల్వకు పడిన గండి, ఇటీవల కూలిన యూటీ వాల్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

కూసుమంచి, సెప్టెంబర్ 23 : ''వరదల కారణంగా దెబ్బతిన్న సాగర్ కాల్వల పనులు ఎందుకు ఆలస్యమవుతున్నాయి? 20 రోజులు దాటినా ఇంకా ఎన్ని రోజులు పనులు చేస్తారు? నీటిపారుదల శాఖ ఉండి ప్రయోజనం ఏమిటి? జిల్లాలో లక్షలాది ఎకరాల పంట భూములు ఎండిపోయిన తర్వాత నీరిచ్చి ఏం లాభం? మీరు రైతులతోనే ఆడుకుంటారా?'' అని స్వయంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇరిగేషన్ అధికారులు, కాల్వ మరమ్మతు పనులు చేస్తున్న గుత్తేదారుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత టి.హరీశ్‌రావు సోమవారం హైదరాబాద్‌లో ఖమ్మం జిల్లా పాలేరు కాల్వకు సంబంధించి మరమ్మతులు చేపట్టకపోవడం, ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై విలేకరుల సమావేశం నిర్వహించి ఆగ్రహం వ్యక్తం చేసిన కొద్ది సమయంలోనే మంత్రి తుమ్మల స్పందించి, అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడం, మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించడం గమనార్హం. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరులో గండిపడిన సాగర్ కాల్వ మరమ్మతు పనులు పూర్తి చేసి ట్రయల్ రన్ వేయగా.. మళ్లీ యూటీ మధ్యలో వాల్ క్రాక్ ఇచ్చి కూలిపోవడంతో తిరిగి శనివారం నుంచి మరమ్మతు పనులు చేపట్టిన విషయం తెలిసిందే. అయితే పనులు ఆలస్యమవుతుండడంతో ఆయకట్టు పరిధిలో గల ఐదు నియోజకవర్గాల్లోని పొలాలకు నీరందకపోవడంతో మంత్రి మండిపడ్డారు. పనుల ఆలస్యానికి ఎవరు కారణమో తెలుసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్తున్న మంత్రి తుమ్మల పాలేరు కాల్వ ప్రాంతాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ గండిపడిన తర్వాత మరమ్మతు చేసి ట్రయల్ రన్ వేసే క్రమంలో మళ్లీ వాల్ కూలిన తీరును మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజినీర్ విద్యాసాగర్‌తో మంత్రి మాట్లాడుతూ.. 'మీ డిపార్ట్‌మెంట్ ఎందుకు ఉంది? రైతుల పంటలకు నీటి అవసరం ఉన్న సమయంలో ఇవ్వకుండా.. మీరంతా ఎందుకు? అసలు మీ ప్లాన్ ఏమిటి?' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల్లో ఆలస్యం ఎందుకు అవుతున్నదని గుత్తేదారు ముత్తయ్యను ప్రశ్నించారు. ఇంతమంది ఉండి.. కాల్వ వాల్ బలహీనంగా ఉన్నప్పుడు గుర్తించకపోవడం ఏమిటన్నారు. జిల్లాలో సాగర్ ఆయకట్టు రైతులకు సాగునీరు లేకపోవడంతో 20 రోజులుగా నానా ఇబ్బందులు పడుతున్నారని, మీరంతా ఉండి ఏం చేస్తున్నట్లని మంత్రి ప్రశ్నించారు. అలాగే రెండోసారి జరిగిన కాల్వ లీక్‌పై ఆరా తీశారు. ఎప్పటి వరకు నీరు ఇస్తారు? యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసి లక్షలాది ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని, అందుకు తగ్గట్లుగా పనులు జరగాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి వచ్చిన రోజు కాల్వను మూసివేసి పనులు చేయమని చెప్పాం.. కానీ.. ప్రయోజనం లేదన్నారు. అధికారుల సమన్వయలోపం వల్లే పనుల్లో జాప్యం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీఈ విద్యాసాగర్, గుత్తేదారు ముత్తయ్య, ఈఈలు వెంకటేశ్వర్లు, ఏసీపీ తిరుపతిరెడ్డి, అనన్య, డీఈలు, నాయకులు రవికుమార్, వెంకటరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సురేశ్, వీరభద్రం, ఉపేందర్, మోహన్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

విజయ డెయిరీ ఎదుట పాడిరైతుల ఆందోళన

- పాల బిల్లులు చెల్లించాలని డిమాండ్
- 26న 'చలో హైదరాబాద్'

ఖమ్మం విజయ డెయిరీ ఎదుట ఆందోళన చేస్తున్న పాడి రైతులు

రఘునాథపాలెం, సెప్టెంబర్ 23 : పాల బిల్లుల చెల్లింపులో ప్రభుత్వ నిర్లక్ష్యంపై పాడి రైతులు నిరసనకు దిగారు.. ప్రతి 15రోజులకు చెల్లించే బిల్లులు రెండున్నర నెలలైనా చెల్లించకపోవడంపై మండిపడ్డారు.. ఈ మేరకు సోమవారం ఖమ్మం నగరంలోని విజయ డెయిరీ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు పాల బిల్లులు వచ్చేవని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక తీవ్ర జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు విజయ డెయిరీకి పాలు పోస్తే బిల్లులు వస్తాయో.. లేదో.. నమ్మకం లేకుండాపోయిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పాల సేకరణ క్రమేపీ తగ్గుముఖం పడుతున్నదని ఆరోపించారు. గ్రామాల్లో కలెక్షన్ ఏజెంట్లకు రైతులు పాలు పోసే పరిస్థితిలేదన్నారు. పశుపోషణ సైతం భారమైనట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఈ నెల 26వ తేదీన హైదరాబాద్ ధర్నాచౌక్‌లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాడి రైతులు ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా నుంచి పెద్దఎత్తున హాజరై ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆందోళన చేసిన వారిలో కోటగిరి నాగేశ్వరరావు, ఇబ్బడి శ్రీను, కుర్రా వినోద్, నల్లగొర్ల శ్రీను, రవీందర్ పాల్గొన్నారు.

లాభాలపై 33 శాతం వాటా చెల్లించాల్సిందే..

రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

- టీబీజీకేఎస్ రాష్ట్ర చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ డిమాండ్
- కొత్తగూడెం హెడ్డాఫీస్ ఎదుట టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 23 : సింగరేణి సంస్థలో నికర లాభాలపై 33 శాతం వాటా చెల్లించాలని, సంస్థలో రాష్ట్ర ప్రభుత్వ రాజకీయ జోక్యాన్ని తగ్గించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని సింగరేణి హెడ్డాఫీస్ ఎదుట సోమవారం సాయంత్రం నిరసన తెలిపిన నాయకులు రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ రాష్ట్ర చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ మాట్లాడుతూ సింగరేణి సంస్థ సాధించిన నికర లాభం రూ.4,701 కోట్లలో 33 శాతం కార్మికులకు రూ.1,550 కోట్లు పంచగా.. మిగిలిన 67 శాతం రూ.3,150 కోట్లు సంస్థ డెవలప్‌మెంట్ కోసం వాడాలనే నిబంధన గతంలో ఎప్పుడూ లేదని, ఈసారి కొత్త విధానంతో కొంత ఆదాయాన్ని పక్కన పెట్టడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇది కార్మికుల కష్టార్జితాన్ని దోచుకోవడమే అవుతుందని, వెంటనే ప్రకటించిన మొత్తం లాభాల్లో నుంచి 33 శాతం కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు, కార్మికులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, కార్మికులకు ఇస్తానన్న హామీలు ఒకటి కూడా ఇప్పటి వరకు అమలు చేయలేదని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు తుమ్మ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, చుంచుపల్లి మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి, సోనా, కొట్టి వెంకటేశ్వర్లు, వేముల ప్రసాద్‌బాబు, అంబుల వేణుగోపాల్, వసికర్ల కిరణ్‌కుమార్, కాగితపు విజయ్‌కుమార్, రాసూరి శంకర్, బూర్గుల రవికుమార్, కంచర్ల శ్రీనివాస్, సూరజ్, వెంకటేశ్వర్లు, కుమార్, పూర్ణచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

- సాగర్ కాలువ గండ్లను పూడ్చని అధికారులు
- ముగ్గురు మంత్రుల తీరుపై అన్నదాతల అసహనం
- రైతులతో కలిసి ఉద్యమిస్తామంటున్న నాయకులు

ఖమ్మంజిల్లా బోనకల్లు మండలంలో నీటి సరఫరా బంద్ అయిన సాగర్ కాలువ


ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలో నెర్రెలుబారిన పంటపొలాలు

నిండిన ప్రాజెక్టులు.. ఎండిన పొలాలు!

ఖమ్మం జిల్లాలో వానకాలం పంటల దుస్థితి

ఖమ్మం, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): వానకాలం సీజన్ వచ్చిందంటే చాలు కోనసీమను తలపించే ఖమ్మంజిల్లాలోని సాగర్ ఆయకట్టు ప్రాంతంలో నేడు నెర్రెలుబారిన పంట పొలాలే దర్శనమిస్తున్నాయి. చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు నిండుకుండలను తలపిస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వ పుణ్యమా అని జిల్లాలో ఈ విచిత్ర పరిస్థితి దాపురించింది. యాసంగిలో సాగర్ ప్రాజెక్టు అడుగంటడంతో సాగునీటికి కటకట అయ్యింది. ఆలస్యమైనా వరుణుడు కరుణించడంతో జిల్లావ్యాప్తంగా సుమారుగా 4లక్షల ఎకరాలకుపైగా సాగు చేశారు. సాగర్ ఎడమ కాలువ పరిధిలోనే 2.50 లక్షల ఎకరాలు సాగు చేశారు. ఆయకట్టు పరిధిలో వరి, మక్క, ఇతర వాణిజ్య పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వరి పొట్టదశకు చేరుకునే సమయంలో జిల్లావ్యాప్తంగా రికార్డుస్థాయి వర్షపాతం నమోదైంది. సాగర్ కాలువ కూడా పొంగి ప్రవహించింది. కాలువకు పలుచోట్ల గండ్లు పడడంతో నీటి విడుదల ప్రశ్నార్థకంగా మారింది. దాదాపు 20రోజులు గడుస్తున్నా గండ్లను పూడ్చకపోవడంతో పంట పొలాలను కాపాడుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

ఖమ్మం జిల్లా బోనకల్లు మండలంలో నెర్రెలుబారిన పత్తి

ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం హట్యాతండాలో ఇసుక మేట వేసిన పంట పొలాలు (ఫైల్)

చేజారిపోతున్న పంటలు

ప్రకృతి ప్రకోపం, యంత్రాంగం నిర్లక్ష్యం వెరసి ఈ వానకాలం సీజన్‌లో సాగర్ కాలువ కింద పంటలు చేజారిపోయే అవకాశం కనపడుతున్నది. సాగర్ ఆయకట్టు కింద 17 మండలాలు ఉండగా, నాలుగు మండలాలకు మాత్రమే కాలువ కవరేజ్ లేదు. జిల్లా రైతాంగం సాగర్ ఎడమ కాలువ మీదనే ఆధారపడి ఉంది. వానకాలంలో ఆయకట్టు పరిధిలో 1.20 లక్షల ఎకరాల వరి పంటను సాగు చేయగా, ప్రస్తుతం పొట్ట దశకు చేరుకున్నాయి. మరో రెండో ప్రధాన పంట పత్తిపంట చేతికి వచ్చే సమయం ఆసన్నమైంది. ఈ సమయంలో పొలాలకు ఎక్కువ నీరు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రభుత్వంలో ముగ్గురు మంత్రులు ఉన్నా పట్టించుకోకుండా, సాగర్ ఎడమ కాల్వకు పడిన గండ్లను పూడ్చని యంత్రాంగ తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. 20 రోజులు కావస్తున్నా కాలువ గండ్లను పూడ్చలేని దుస్థితిలో ప్రజాప్రభుత్వం ఉందని వామపక్ష నాయకులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సాగర్ కాలువ గండ్లను తక్షణమే పూడ్చి ఇసుక మేటలు వేసిన పంట పొలాలకు, వరదలో కొట్టుకుపోయిన పంట పొలాలకు పరిహారం అందజేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే రాజకీయాలకు అతీతంగా రైతులను కూడగట్టి ప్రభుత్వంపై పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పత్తికి ప్రభుత్వానిదే బాధ్యత

గార్లపాడు రెవెన్యూలో కౌలు తీసుకొని మూడు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. 15రోజులుగా సాగర్‌జలాలు రాకపోవడం వల్ల పత్తి ఎండిపోతుంది. రూ.1.20 లక్షలు అప్పుగా తెచ్చి పెట్టుబడి పెట్టాను. ప్రస్తుతం ఎకరాకు రెండు క్వింటాళ్ల పత్తి కూడా వచ్చే పరిస్థితి లేదు. ఈ పంటను పీకివేసి మరో ప్రత్యామ్నాయ పంట వేసుకోవాల్సిందే. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించి రైతులకు పరిహారం అందించాలి.

– బాలబోయిన కృష్ణ, ముష్టికుంట్ల, ఖమ్మం జిల్లా

నీళ్లు ఇవ్వడంలో ప్రభుత్వ వైఫల్యం

ఇలాంటి దుర్భర పరిస్థితి నేను ఎన్నడూ చూడలేదు. ప్రాజెక్టుల్లో నీరు లేని రోజులు చూశాం. ప్రస్తుతం ప్రాజెక్టులు నిండుకుండలా మారి గేట్లు ఎత్తి నీటిని బయటకు వదులుతున్నారు. ఉన్న నీటిని పంట పొలాలకు తరలించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.

– భాగం వెంకటేశ్వరరావు, సిద్ధిక్‌నగర్, ఖమ్మం జిల్లా

దిక్కుతోచని పరిస్థితి

నాకు 4 ఎకరాలు ఉంది. దీనికి మరో 4 ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి, పత్తి, వరి సాగు చేశా. మిర్చి పైరుకు ఇప్పటికే ఎకరాకు రూ.30 వేలు ఖర్చయింది. ఇప్పుడు కండ్ల ముందే పంట ఎండిపోతుంది. ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొన్నది.

– ధరావత్ బాలు, మేకాలకుంట, ఖమ్మం జిల్లా

నీటి బండ్‌తో తీవ్రనష్టం

నేను 30 ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశా. 6 ఎకరాల్లో మిర్చి, 3 ఎకరాల్లో మాగాణి కేవలం సాగర్‌జలాలపై ఆధారపడి సాగు చేస్తున్నా. పంటపైర్లు ఏపుగా పెరుగుతున్న సమయంలో సాగర్ జలాలను నిలిపివేశారు. గండ్ల కారణంగా ఈ నీటిని బంద్ చేయడం వల్ల నాకు తీవ్రనష్టం కలిగింది.

– కొమ్మినేని ఉపేందర్, రావినూతల, ఖమ్మం జిల్లా

కాంగ్రెస్ సర్కారుపై రేషన్‌డీలర్ల సమరం

- హామీలను అమలు చేయాలని డిమాండ్
- నేడు హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ
- ఖమ్మంజిల్లా నుంచి ఆరు వందల మంది పయనం

రఘునాథపాలెం, సెప్టెంబర్ 23 : కాంగ్రెస్ సర్కారుపై రేషన్‌డీలర్లు తిరుగుబావుటా ఎగురవేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు కోసం పోరుబాటకు దిగారు. పది నెలలైనా హామీల ఊసెత్తకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రేషన్‌డీలర్లంతా హైదరాబాద్ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీసేందుకు కార్యాచరణ చేశారు. మంగళవారం పటాన్‌చెర్వులోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్ వేదికగా భారీ బహిరంగ సభకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ పెద్దలను పిలిచి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను గుర్తు చేసి సాధించుకునేందుకు సిద్ధమయ్యారు. ఒక్క ఖమ్మంజిల్లా నుంచే ఆరు వందల మందికిపైగా రేషన్‌డీలర్లు మంగళవారం హైదరాబాద్‌కు పయనమై వెళ్లనున్నారు.

గౌరవవేతనం, కమీషన్ పెంపునకు హామీ ఇచ్చిన కాంగ్రెస్

రేషన్‌డీలర్లకు రూ.5 వేల గౌరవవేతనం, కమీషన్ క్వింటాల్‌కు రూ.300 చేస్తామని ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అయితే ప్రభుత్వం ఏర్పాటై 10నెలలు పూర్తయినా హామీ ఊసే ఎత్తడం లేదు. డీలర్స్ అసోసియేషన్ నేతలు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు పలువురు మంత్రులను కలిసి హామీల గురించి విన్నవించారు. మంత్రి పట్టించుకోకపోవడంతో ఆందోళనకు సైతం పిలుపునిచ్చారు. దీంతో స్పందించిన ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తామని మరోమారు హామీ ఇచ్చింది. తిరిగి నెలలు గడుస్తున్నా.. స్పందించకపోవడంతో తెలంగాణ డీలర్స్ అసోసియేషన్ సంక్షేమ సంఘం నేతలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రేషన్‌డీలర్లను ఐక్యం చేసే కార్యాచరణకు దిగింది. భారీ బహిరంగ సభకు పిలుపునిచ్చి రాష్ట్ర మంత్రులు ఉత్తమకుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిను ఆహ్వానించి డిమాండ్లను ముందుంచనున్నది. డీలర్ల హక్కుల సాధనకు పెద్దఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరికలు జారీ చేయనున్నది. ఖమ్మంజిల్లా రేషన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బానోతు వెంకన్న ఆధ్వర్యంలో ఆరు వందల మంది రేషన్‌డీలర్లు మంగళవారం హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్లనున్నారు.

హామీలను వెంటనే అమలు చేయాలి

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రేషన్‌డీలర్లకు రూ.5 వేల గౌరవవేతనం, క్వింటాకు రూ.300 కమీషన్ వెంటనే అమలు చేయాలి. అధికారంలోకి వచ్చి పదినెలలైనా పట్టించుకోకపోవడంతో ఆందోళనకు సిద్ధమయ్యాం. రాష్ట్రంలోని డీలర్లంతా కలిసి హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నాం. హామీలను అమలు చేయకుంటే భవిష్యత్తులో ఆందోళనలను తీవ్రతరం చేస్తాం.

– షేక్ జానీమియా, ఖమ్మంజిల్లా ప్రధాన కార్యదర్శి, రేషన్‌డీలర్స్ అసోసియేషన్

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

సింగరేణి హెడ్డాఫీస్, తహసీల్ ఎదుట కార్మిక సంఘాల ఆందోళనలు

ఆందోళన నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 23 : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వివిధ మండలాల్లో సీపీఐ, ఏఐటీయూసీ, సీఐటీయూ, కార్మిక సంఘాల జేఏసీ, ఐఎన్‌టీయూసీ, ఐఎఫ్‌టీయూ, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి కొత్తగూడెం సింగరేణి హెడ్డాఫీసు, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసనలు, ధర్నాలు, ప్రతుల దహనాలు చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డి.వీరన్న అధ్యక్షతన కొత్తగూడెం సింగణేణి హెడ్డాఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నరసింహారావు, ఐఎన్‌టీయూసీ నాయకులు త్యాగరాజ్, జలీల్, ఇప్టూ నుంచి సతీశ్‌లు పాల్గొని మాట్లాడారు. సింగరేణి బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణను ఆపాలని, బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోదీ సర్కార్ యథేచ్ఛగా నల్ల చట్టాలను తీసుకొచ్చి కార్మిక హక్కులను కాలరాస్తున్నదని, యావత్ కార్మిక లోకం, సంఘాలు ఐక్య పోరాటాలు చేయకపోతే ఈ విధానాలను తిప్పికొట్టడం సాధ్యం కాదన్నారు. జెండాలు, ఎజెండాలు పక్కనపెట్టి కార్యక్రమంలో పాలుపంచుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూరం ఐలయ్య, రమణ, భాస్కర్, లక్ష్మి, సంజు, జాటోత్ కృష్ణ, చంద్రశేఖర్, కాలం నాగభూషణం, అల్బర్ట్, యాకూబ్ పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి

- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి
- ఇల్లెందు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 23 : రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇల్లెందులోని ముకుందాపురం నుంచి కట్టుగూడెం వరకు రూ.5 కోట్లు, మొండికుంట నుంచి రామచంద్రరావుపేట వరకు రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్లకు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. పట్టణంలో రూ.కోటి వ్యయంతో స్విమ్మింగ్ పూల్, బుగ్గవాగు బ్రిడ్జి రిటైనింగ్ వాల్, ఆడిటోరియం, ఫౌంటెన్లు, మోడల్ మార్కెట్‌కు ప్రహరీ, ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో రూ.1.30 కోట్ల వ్యయంతో పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం బొజ్జాయిగూడెం ఎస్ఎస్ గార్డెన్స్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని, అవసరమైతే పోలీసు శాఖ సహకారం తీసుకోవాలన్నారు. ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వివిధ శాఖల్లో మంజూరైన పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, కాని వాటికి ప్రతిపాదనలు పంపిస్తే మంజూరయ్యేందుకు కృషి చేస్తానన్నారు. విధి నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా బాధ్యతగా పని చేయాలని సూచించారు. త్వరలోనే రేషన్, హెల్త్ కార్డులతోపాటు అర్హులకు ఇందిరమ్మ గృహాలను మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లు జితేశ్ వి పాటిల్, అద్వైత్‌కుమార్, ఎస్పీ రోహిత్‌రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, టీజీఐడీసీ చైర్మన్ ముప్పా విజయ్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, సొసైటీ చైర్మన్లు మూల మధుకర్‌రెడ్డి, వడ్లమూడి దుర్గాప్రసాద్, మేకల మల్లిబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.